# నిప్పు

చుట్టూ ప్రశాంతంగా వుంది. చెట్లగుబుర్లలోనుంచి కీచురాళ్ళ అరుపులు నిర్విరామంగా వినిపిస్తున్నాయి. దూరంగా మామిడి చెట్టుమీదఏదో పక్షి వికృతంగా అరుస్తున్నది. లోపల వెలుగుతున్న మెర్క్యురీలైటు కాంతి గుమ్మం బయట కొంతమేర మాత్రమే పడుతున్నది. అదితప్ప ఇక అంతా కనుచూపుమేర కటికచీకటి....నల్లని కాయితం మీద మరింతనల్లని సిరాచుక్కలు పడినట్టు మామిడి చెట్లూ కొబ్బరిచెట్లూ లీలగా కనుపిస్తున్నాయి.

పుల్లమరాజు గుమ్మాని కానుకుని కూర్చుని పైగుడ్డతీసి విసురుకుంటూ "అబ్బబ్బ ఏం చెమట! గాలేలేదు" అనుకున్నాడు.

లోపల ఒకేఒక బల్ల దగ్గర పేకాట జోరుగా సాగుతున్నది. వాళ్లు అయిదుగురు! గుమ్మం వైపు వీపుతిప్పి కూర్చునివుండి మాటిమాటికీ "ఛీ! వెధవాట. ముక్కలు పడటమేలేదు." అని విసుక్కుంటున్న బుంగమీసాల

భారీవ్యక్తి విశ్వనాథం. ఆయన ప్రక్కనే కూర్చుని చాలా శ్రద్ధగా పేక ముక్కలు సర్దుకుంటున్న వాడు తులసీదాసు. ఆయన పిట్టవంటి మనిషి. నల్లని వాడు. ఆపక్కన పలుచని అద్దాల కళ్ళజోడు మాటిమాటికీ సద్దు కుంటూ కూర్చుని వున్నవాడు ప్రభాకరం.........ఆయన పక్క కుర్చీలో గుమ్మని కెదురుగా కూర్చుని వున్నవాడుశాస్త్రి. ఆటపారేసిశాస్త్రితోమాట్లా డుతున్నవాడు ప్రసాదరావు.

విశ్వనాథం తులసీదాసువంక అసూయగా చూస్తూ 'ఇవాళఈయన గారు నక్కను తొక్కి వచ్చాడయ్యా; వరసనే ఆటలు కొట్టేస్తున్నాడు.' అన్నాడు.

ప్రభాకరం జోడు సరుకుంటూ 'ఇవాళేం ఖర్మ! ఆయన రోజూ నక్కనేతొక్కి వస్తూవుంటాడు,' అన్నాడు. ఆమాటలువిని మిగిలినవారిలో ఒకరు నవ్వారు. నవ్వని వ్యక్తి ప్రసాదరావు. ఆయన తులసీదాసువంక అసూయగా చూడటానికి అనేక కారణాలున్నాయి. ఆయనకు ఎందుకో మొదటినించీ తులసీదాసు అంటే అసహ్యం. ఆయనకు సాధారణంగా తన కంటే తక్కువ సంపాయించేవాళ్ళంటే అసహ్యం. అదీకాక ఆయనకు వారం రోజుల క్రితమే ఒకనాడు తెల్లవారుఝామున చిత్రమైన కలవచ్చి మనసును పాడుచేసింది. ఆయన ఆనాడు కలగని మేలుకొని కళ్ళు విప్పి చూస్తే ఆయన రెండో భార్య శాంత పడుకుని, ప్రశాంతంగా నిద్రపోతు న్నది. ఆమె ముఖం నిర్మలంగా వుంది. ఆమె పసిపాపలా నిద్రలోనవ్వు తున్నది. అయినా ఆయన మనసు చెడింది. మిగిలిన రాత్రి అంతా కన్ను మూయకుండా గడిప్పాడు. అంతకు ముందురోజే తులసీదాసును ఆయన మొదటిసారి చూశాడు. ఎందుకో చూసీచూడగానే ఆయనకు తులసీదాసు పట్ల వైముఖ్యం కలిగింది. చిత్రమేమిటంటే ఆ మరునాడే ఆ కలరావటం ఛీ! ఛీ! ఎంత అసహ్యమైన కల !

ప్రసాదరావు ముక్కలు బల్లమీదపారేసి "రేయ్! పుల్లంరాజూ! ఇలారా?" అని అరిచాడు.

పుల్లంరాజు గభాలున లేచి 'అయ్యా' అంటూవచ్చాడు.

"ఏమున్నాయి తాగడానికి?"

"కాఫీ డికాషనయిపోయిందండీ....టీ ఉంది బాబూ! తెమ్మంటారా?"

"ఏదో ఒకటి తీసుకురా....కళ్ళు మూతలుపడుతున్నాయి." అంటూ ప్రసాదరావు వాచీవంక చూసుకున్నాడు. ఒంటిగంట! ఎక్కడో గుడ్లగూబ అరుస్తున్నది.

పుల్లమరాజు లోపలికి వెళ్ళి టీ కలుపుతూ కిటికీలోనుంచి బయటికి చూశాడు. బయట అంతా చీకటి ఘనీభవించినట్టున్నది. కిటికీ పక్కనే వున్న చెట్టుమీద ఏవో బుల్లిపక్షులు గొడవ చేస్తున్నాయి. పుల్లమరాజు ఇంటిని గుర్తుచేసుకున్నాడు. అతని ముసలితండ్రి గుడిసె బయట కుక్కిమంచంలో పడుకుని వుంటాడు. లోపలిగూటిలో సన్ననిదీపం వెలుగుతూ వుంటుంది. పుల్లమరాజు భార్య కాపురానికివచ్చి సంవత్సరంకూడా నిండలేదు. అతని పెళ్ళి క్లబ్బులో, పెద్దలందరి సహకారంతో, ధన సహాయంతో, ఘనంగానే జరిగింది. క్లబ్బు బాయ్ పెళ్ళి అనగానే నలుగురూ చందాలు వేశారు. ఆ డబ్బుతో పుల్లమరాజు తన గుడిసెముందు చక్కగా పందిరి వేసి తనవారిని నలుగురినీ పిలిచి ఘనంగా పెళ్ళిచేసుకున్నాడు. ఆ పిల్లకు వయసు కూడా ఎంతోలేదు. పట్టుమని పద్ధెనిమిదేళ్ళు ఉండవు. పచ్చగా గుమ్మటంలా వుంటుంది. పెద్దపెద్దకళ్ళతో అమాయకంగా చూస్తూవుంటుంది. పుల్లమరాజు గుడిసెలో తనకోసం ఎదురుచూసిచూసి అలాగే

నిద్రలో ఒరిగిపోయే తన భార్యను తలుచుకున్నాడు. క్షణంలో అతని నరాల్లోరక్తం జివ్వున పరుగులు తీసింది.

అంతలో లోపలినుంచి కేక "ఏరా రాజు! ఏదిరా టీ? తొందరగారా"

పుల్లమరాజు టీ కప్పు పట్టుకుని హాల్లోకి వచ్చాడు. ప్రసాదరావు దాన్ని అందుకుని వేడి వేడి టీ చప్పరిస్తూ చాలా శ్రద్ధగా ఆట ఆడుతున్న తులసీదాసు వంక తీక్షణంగా చూస్తున్నాడు. 'ఖర్మ! వాడే క్షణంలో కనిపించాడో గాని నాకు మనశ్శాంతి లేకుండా చేశాడు. అయినా ఈ ఆఫీసర్ల క్లబ్బులో వెధవ నూటయాభై రూపాయల గుమాస్తాగాడు పేకాడట మేమిటి? వచ్చే కమిటీ మీటింగులో ఆఫీసర్లుతప్ప మరెవరూ పేకాటకు రాకుండా ఏదైనా కట్టుదిట్టమైన తీర్మానం చేయించాలి' అనుకున్నాడాయన. ఆయనకు మాటి మాటికీ ,ఆ కల గుర్తు వస్తున్నది. వారంరోజులనుంచీ యింట్లో తన భార్య మొహం చూసినప్పుడల్లా, క్లబ్బులో తులసీదాసు మొహం చూసినప్పుడల్లా ఆ కలే మళ్ళీ మళ్ళీ గుర్తు వస్తున్నది.

టీతాగుతూ అకారణంగా 'ఛీ ఛీ' అనుకుని, మిగిలిన టీవొది లేసి పుల్లమరాజు వంక తిరిగి "ఏరా! అలా పందిరి గుంజలా నిలబడక పోతే ఆ కప్పు తీసుకుపోరాదూ?" అని కసురుకున్నాడు. తర్వాత సిగిరెట్టుతీసి వెలిగించు కున్నాడు. పొగవదులుతూ ఆపొగలోకే చూస్తూ కూర్చున్నాడు.ఆ ఆట విశ్వనాథం తులసీదాసూ యిద్దరే ఆడుతున్నారు. ఎవరి పాటికి వారు పట్టుదలగా అవతల వాళ్ళకు ఆటకాకుండా చూడాలని ఆడుతున్నారు. మిగిలిన యిద్దరూ చెరొకరి ఆటచూస్తూ సలహా యిస్తున్నారు.

ప్రసాదరావు మాత్రం తాను సృష్టించిన పొగ మేఘాలలోకి చూస్తూ కూర్చున్నాడు. మళ్లీ అదే కల గుర్తుకు వచ్చింది....అదొక పడవ ....నీళ్ళమీద తేలుతూ పోతున్నది. అందులో కొందరు జనం....వాళ్ళల్లో

తనకు పరిచితమైన ముఖాలేవీ ఉన్నట్టు గుర్తులేదు. తానూ తనభార్య ఒక పక్కన ఉన్నారు.... అంతలో....

ప్రభాకరం "షో" అని కేకపెట్టాడు. తులసీదాసు ముక్కలు బల్లమీదపరిచాడు. శాస్త్రి "ఛ ఛ! ఆ ముక్క వేయవలసిందికాదు." అన్నాడు.

"వెయ్యక చస్తామా! ఆయన అదృష్టం అది" అంటూ విశ్వనాథం ముక్కలు చేతిలోకి తీసుకుని రూపాయలు తులసీదాసు వైపుకు తోశాడు.

పుల్లమరాజు టీకప్పు లోపల పెట్టి వచ్చి అక్కడే గోడకానుకుని నిలబడివుండి ఆలోచనలోపడ్డాడు. అతనికి తనభార్య గుర్తుకు వచ్చింది. అంతలో ఆశ్చర్యం కలిగింది. వీరందరూ రోజూ అర్ధరాత్రి వేళదాకా ఇక్కడ పేకాడుతూ వుంటారు. సంవత్సరాల తరబడి అలా ఆడుతూనే వున్నారు. వీళ్లందరికీ ఇళ్ళూవాకిళ్ళూలేవా? పెళ్ళాంపిల్లలూ లేరా? వాళ్ళు వీళ్ళకోసం ఎదురుచూస్తూ వుండరా?

మళ్లీ అందరూ ముక్కలుచేతిలోకి తీసుకున్నారు. సర్దుకుంటున్నారు. అరనిమిషంలో ప్రసాదరావు పేకబల్లమీద పడేసి "ఎవరయ్యా ముక్కలుపంచిందీ! పాడుచెయ్యి" అంటూ లేచి కిటికీ దగ్గరికి వెళ్ళి బయటికి ఉమ్మేశాడు? తర్వాత అక్కడే కొద్ది క్షణాలు నిలబడ్డాడు. బయట పిలిస్తే బదులు పలికేట్టు చిక్కగా ఉన్న చీకట్లోకి చూస్తూవుండగా మళ్ళీ ఆ కల గుర్తుకు వచ్చింది.... పడవలో తామిద్దరూ కూర్చుని వుండగా తన భార్య ఉన్నట్టుండి లేచి పక్కకు వెళ్ళింది. తాను అటువైపుచూశాడు. ఆమె నిలబడి వుండి పమిటకొంగు నోటిలో పెటుకుని జాకెట్టు ముడివేసుకుంటున్నది. గాలికి ముంగురులు కదులుతున్నాయి, పలుచని పమిటలో జాకెట్టు ముడి వేసుకుంటున్న ఆమె పచ్చని చేతులు కనిపిస్తున్నాయి. ఆమె ఎటో చూస్తూ నవ్వుతున్నది.... తానూ అప్రయత్నంగా అటు చూశాడు. అక్కడ

తులసీదాసు నిలబడి వున్నాడు. అంతలో కల చెదిరిపోయింది... మెలకువ వచ్చీరాగానే భార్యమొహంలోకి చూశాడాయన. ఆమె మామూలుగా ప్రశాంతంగా నిద్రపోతున్నది. ఆ తర్వాత ప్రసాదరావు లేచి ఎందుకో కలవర పడుతున్నవాడిలా అటూ యిటూ కాసేపు తిరిగి మళ్ళీ పడుకున్నాడు. కాని, ఇక కోడికూసేవరకూ కంటిమీదికి కునుకేరాలేదు.

ప్రసాదరావు మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. తర్వాత పుల్లమరాజును పిలిచి "ఇవాళ ఇళ్ళు ఎక్కడ ఎక్కడ తగలడ్డాయిరా?" అని అడిగాడు?

పుల్లమరాజు "అయ్యా! లంకలో మజ్జానం తగుల బడ్డాయండీ.... రెండొందల గుడిసెలు....నీళ్ళకార్లొచ్చినా ఏంచెయ్యలేక పోయాయండీ. ....అంతా భస్మం.... బూడిద...." అన్నాడు.

"ఇవాళ అదొక్కటేనా?" ఇది విశ్వనాథం ప్రశ్న.

"అవునండి. అదొక్కటే...." అని పుల్లమరాజు సమాధానం.

"రోజూ ఈ ఇళ్ళు తగల బడట మేమిటో.... వెధవ గోల...." శాస్త్రి ముక్కలు సర్దుకుంటూ అన్నాడు.

"తగల బడటంలేదు. .... తగలబెడుతున్నారు. .... 'ఫలానా పేట తగలపెడతాం' అని నోటీసిచ్చి, మరీ తగలబెడుతున్నారు." విశ్వనాథం మీసాలు సర్దుకుంటూఅన్నాడు,

ప్రభాకరం ముక్కలు క్రింద పడేస్తూ "ఏమిటేమిటో కథలు వింటున్నాం.... మొన్న ఆ మురికి పేటలో ఎవడో కొత్త మనిషి కనిపించాడు.... వాడు ఒక పాకముందు ఒక్కక్షణం నిలబడి తర్వాత మామూలుగా వెళ్ళిపోయాట్ట. అంతలో పాక గుప్పుమన్నదిట.... వాడేదో పొడి చల్లిపోయాడని పుకారు" అన్నాడు.

"నేను మరొరకంగా విన్నాను" అన్నాడు విశ్వనాథం. ఆ గుడిసెలో కాపురం వుండేవాడి పెళ్ళానికి మరొకడికీ జోడీట.... మొగుడింటికి వచ్చే సరికి లోపల ఆ యిద్దరూ ఉన్నార్ట. ఆ కోపంతో మొగుడు తలుపు బయట గొళ్ళెంపెట్టి ఇంటికి నిప్పు పెట్టాట...."

పుల్లమరాజు నెమ్మదిగా "మొన్న మరీ దారుణం బాబయ్యా! ఆ లంకలో పాకలు తగలబడుతావుంటే ఒక ముసల్ది గుడిసెలోపల ఒక జత గాజులు మర్చిపోయొచ్చిందంట. ఆటికోసం ఎల్లి మంటలో చిక్కుకుపోయి నాదంటండీ." అన్నాడు.

"మళ్ళీ తిరిగొచ్చిందా?"

"ఏం తిరిగి రావటం బాబూ! క్షణంలో మసయిపోయిందండి."

ప్రసాదరావు నవ్వి "వాళ్ళు పాకల్లో ఉన్నారనీ, అవి మురికి పేటలనీ, వాళ్ళు బీదవాళ్ళనీ లేనిపోని నమ్మకాలు మనకు....నిజానికి వాళ్ళ దగ్గరున్నంత డబ్బు మనదగ్గరకూడా లేదంటాను నేను. వాళ్ళు ఇంటిల్లపాదీ సంపాయిస్తారు. మనలో అలా కాదుగా! సంపాయించేదొక్కడు తినేది పదిమంది. మనం ఇస్త్రీ చొక్కాలకూ, క్రాపింగులకూ, బూట్లకూ షోకులకూ డబ్బు తగలేస్తాం. వాళ్ళు చక్కగా కడుపునిండా తిండి తింటారు. అడుక్కునీ, కూలి చేసి, జేబులుకొట్టి, సంపాయించి వాళ్ళు పెద్ద పెద్ద వడ్డీలకు డబ్బు తిప్పుతూవుంటారు తెలుసా? ఆ ముసల్ది జత గాజుల కోసం మంటల్లోకి వెళ్ళిందంటే ఏమిటర్థం?" అన్నాడు.

తులసీదాసు అంతవరకూ మాట్లాడనివాడు ఇప్పుడు తలయెత్తి చూశాడు. నెమ్మదిగా "అంటే మీ ఉద్దేశం, మురికి పేటల్లో, పాకల్లో ఉండేవాళ్ళందరి దగ్గరా బంగారం, డబ్బూ ఉన్నాయనేనా?" అన్నాడు.

ప్రసాదరావుఓరగా చూస్తూ "ఇప్పుడు మీరు విన్నదేమిటి! వాలకం

చూస్తూ ఉంటే మీకు ఆ మనుషులపట్ల బోలెడుసానుభూతి ఉన్నట్టుందే .... మీకు తెలీదేమో! గవర్నమెంటు ఫ్యామిలీప్లానింగ్ అనగానే మనం దరం పరుగెత్తుకువెళ్ళి దేశక్షేమంకోసం ఆపరేషన్లు చేయించుకున్నాం. మురికిపేటల్లో ఉండేవాళ్ళెవరూ చేయించుకోలేదు తెలుసా? వాళ్ళు కావలసినంత మంది పిల్లల్ని కంటున్నారు. సంఘంలో వాళ్ళ సంఖ్య పెరిగిపోతున్నది. క్రమంగా మన పిల్లల సంఖ్య తగ్గిపోయి ఈ దగుల్బాజీల సంఖ్య పెరిగిపోయి కల్లోలం మొదలవుతుంది. పదిమంది మాట కదా చెల్లుతుంది? అప్పుడు వాళ్ళు డిక్టేట్ చేస్తారు. మన పిల్లలింక ఎందుకూ పనికి రారు"....అని మాట్లాడుకుంటూ పోయాడు.

శాస్త్రి నవ్వుతూ "ఈ ఇళ్ళు తగలబడటం గొడవ లేకుండా ఈ స్లమ్స్ అన్నీ ఖాళీ చేయిస్తే సరి...." అన్నాడు.

"ఖాళీ చేయించి వాళ్ళందర్నీ ఎక్కడికి పంపిస్తావు? చంద్రమండలానికింకా రాకపోకలు మొదలేకాలేదు." అన్నాడు ప్రభాకరం.

ప్రసాదరావు కనుబొమ్మలు ముడిచి "ఖాళీ చేయించి?" అని రెట్టించాడు.

"వాళ్ళకు కాస్త పర్మినెంటుగా పడుండే ఏ ఆస్బెస్టాస్ షీట్స్‌తోనో చవకలో యిళ్ళు కట్టించి యిస్తేసరి. హౌసింగ్ బోర్డులూ అవీ ఉన్నాయిగా?" అన్నాడు శాస్త్రి.

ప్రసాదరావు "నువ్వెంత ఫూల్‌వోయ్" అన్నట్టుచూసి "వాళ్ళకు యిళ్ళు కట్టించి యివ్వడమా? నీది గొప్పబుర్రశాస్త్రీ. ఎంత మందికని యిళ్ళు కట్టించి యివ్వగలదు ప్రభుత్వం? అయినా ఆ పాకల్లో వున్నవాళ్ళు ఇళ్ళు కాలిపోతే మళ్ళీ కట్టించుకోలేరనా నీ ఉద్దేశం? వాళ్ళదగర బంగారు గాజులుంటాయి. డబ్బూ ఉంటుంది. నీకుకావలిస్తే వాళ్ళలో ఎవడైనా అప్పు పెట్టగలడు, ఆవడ్డీకి యిష్టపడి తీసుకుంటే. పైకి చూడడానికి పాక

లాగే వుంటుంది. లోపల సారా వ్యాపారాలూ, వడ్డీ వ్యాపారాలూ, ఇంకా ...." అంటూ ఆగాడు.

"ఇక ఆ పై వ్యాపారాల సంగతి చెప్పకు...." అని పెద్దగా నవ్వాడు విశ్వనాథం. మిగిలిన యిద్దరూ శ్రుతి కలిపారు.

తులసీదాసు నవ్వలేదు. పైగా నిట్టూర్చి "మీరు పొరబడుతున్నా రనుకుంటాను సర్! జతగాజుల కోసం ఒక ముసిల్ది మంటల్లోకి వెళ్ళి చచ్చిపోయిందని విని ఆపాకల్లో వాళ్ళందరికీ బంగారం నగలున్నాయని మీరు కంక్లూడ్ చెయ్యడం చిత్రంగా వుంది. జత గాజుల కోసం మంటల్లోకి మీరూ నేనూ వెళ్ళగలమా? జతగాజులూ సర్వస్వం అయినవాళ్ళే అలా చేయగలరు. మరొకరయితే ప్రాణాలకు తెగించి అలా ఉరికిపోరు...."అన్నాడు

ప్రసాదరావు విశ్వనాథంవైపు చూసి కన్ను గీటి వ్యంగ్యంగా "వీరు గొప్ప సోషలిస్టో, లేకపోతే ఏ ఫెలో ట్రావెలరో అనుకుంటాను. మీలాటివాళ్ళు చాలామంది ఈ చిలక పలుకులు పలకగా విన్నాను. అంతా కుర్రతనం.... కుర్రతనపు మాటలూ.... ప్రపంచం తెలీదు అనుభవం సున్న" అన్నాడు.

తులసీదాసు మ్లానంగా నవ్వి ఊరుకున్నాడేగాని సమాధానం చెప్ప లేదు. ఆట నెమ్మదిగా సాగుతున్నది. ప్రసాదరావు మళ్ళీ ముక్కలు బల్ల మీద పడేసి తీరికగా కూర్చుని "ఏమండీ.... మీ యిల్లెక్కడ?" అని అడి గాడు తులసీదాసును.

తులసీదాసు నెమ్మదిగా చెప్పాడు.

"మీకు పెళ్ళయిందా?"

"ఆఁ."

"పిల్లలున్నారా?"

"నలుగురు."

"ఏం? ఫ్యామిలీ ప్లానింగ్ అమలు జరపలేదా?"

తులసీదాసు జరిపానన్నట్టు తల ఊపాడు.

"మీరుండే యింటికి అద్దె ఎంత!"

"పాతిక రూపాయలు."

"అబ్బో! నూటయాభై రూపాయలజీతంలో పాతిక రూపాయలు అద్దెకేపోతాయన్నమాట. మీరుండేది పూరిపాకా? డాబాయిల్లా!"

"రెండూకాదు. పెంకుటిల్లు"

"పెంకుటిల్లయితే ప్రమాదమేనండోయ్. అంటుకుందంటే ఆర్పడం కూడా కష్టం."

"కానివ్వండి. రాబోయే ప్రమాదమేదో మనం ఆపితే ఆగుతుందా!"

"సోషలిస్టులు అట్లా మాట్లాడకూడదను కుంటాను."

తులసీదాసు ఈసారి మాట్లాడలేదు.

ప్రసాదరావు గోళ్లుకొరుక్కుంటూ కూర్చున్నాడు. తర్వాత సిగరెట్టు ముట్టించి పుల్లమరాజు వంకతిరిగి "ఒరేయ్! అఫ్యాను మరికాస్త వేగంగా తిప్పరా ఉక్కపోస్తున్నది." అన్నాడు. మళ్ళీ ఏదో మాట్లాడటం ప్రారంభించాడు.

పుల్లమరాజు ఫ్యాను వేగంపెంచి మళ్లీ గుమ్మాని కానుకుని కూర్చున్నాడు. అతనిభార్య ఈపాటికి మంచినిద్రలో ఉండి వుంటుంది ఏం కలలు కంటున్నదో! మొన్ననొకసారి కలలో తానే కనిపించానని చెప్పింది. పిచ్చిది.... ఇవ్వాళ ఫస్టుతారీఖనే విషయం మరిచిపోయి రాత్రికి పెంద

రాశేవస్తానని, వచ్చేటప్పుడు మల్లెపూలు తెస్తాననీ చెప్పిమరీ వచ్చాడు. ఇప్పుడు అర్ధరాత్రి దాటింది. వీళ్లేమో లేవరు. వీళ్ళవరసచూస్తే తెల్లవారే దాకా ఆడుతూ కూర్చునేటున్నారు. అవును. వాళ్ల సొమ్మేంపోయింది? రేపు ఆదివారం. ఎలాగూ సెలవు.... తాను కదిలేందుకు వీలులేదు. మునుపో సారి తండ్రికి జబ్బుగా వుండి కాస్సేపు ముందుగా ఇంటికి వెడితే మర్నాడు తల వాచేట్లు చివాట్లు తినవలసివచ్చింది.

దూరంగా ఎక్కడో ఆకాశంలో ఎర్రని రంగు కనిపిస్తున్నది. ఎక్కడో యిళ్ళు తగలబడుతున్నట్టున్నాయి.

మళ్ళీ లోపలినుంచి కేక.

పుల్లమరాజు లేచివెళ్లాడు. ప్రసాదరావు తీరికగా కూర్చుని వుండి, "ఏరా రాజూ! విన్నావుగా ఈ అయ్యగారి మాటలు? మీ పాకలన్నీ తీయిం చేసి మీకు మంచి మంచి డాబాలు కట్టించి యివ్వాలిట గవర్నమెంటు. నువ్వేమంటావు?" అని అడిగాడు.

పుల్లమరాజు "మాకు డాబా లెందుకుసార్! ఏదో పాకల్లో పడుండే వాళ్ళం" అన్నాడు.

"అబ్బే! అదేంవల్లకాదు. మీరు అట్లా పాకల్లో ఎందుకుండాలి? మీరుమాత్రం మాలాగా మనుషులు కారా ఏమిటి?"

పుల్లమరాజు ఏదో ప్రమాదం పసిగట్టి నిశ్శబ్దంగా నిలబడ్డాడు. తులసీదాసు అప్పటికే కళ్లు చిన్నవిచేసి ప్రసాదరావు వంక చూస్తున్నాడు. ప్రసాదరావు ఊరుకోలేదు. "అవునయ్యా! మనుషులంతా సమానమే. ఒకడెక్కువా ఒకడు తక్కువా ఏమిటి? దేవుడందర్నీ ఒకేలాగా పుట్టిం చాడు. అందరి నరాల్లోనూ రక్తమే ప్రవహిస్తూ వుంటుంది. ఏమంటావు? ఈ అయ్యగారు చెప్పేది నిజమా? కాదా?"

పుల్లమరాజు ముందు వ్యంగ్యంగా నవ్వుతున్న ప్రసాదరావు వంక చూశాడు. తర్వాత తులసీదాసువంక తిరిగాడు. తులసీదాసు దెబ్బతిన్న వాడిలా చూస్తున్నాడు.

విశ్వనాథం "పోనీవయ్యా, ముందు ఆట ఆడు. ఆ కబుర్లు మన కెందుకు?" అన్నాడు ప్రసాదరావును వారిస్తూ. కాని ప్రసాదరావు పేకలు బల్లమీద పడేసి "అలా వల్లకాదు. ఏం పుల్లంరాజూ! ఏమంటావు? మనుష లందరూ ఒకటేకదూ?" అంటూ తులసీదాసు వంక చూపించి "మేమూ, ఆయనగారూ, నువ్వూ అంతా ఒకటేనా?" అని అడిగాడు.

పుల్లమరాజు కంగారుపడి "అదేంటండీ.... మీరూ నేనూ ఒకటెలా గవుతామండీ?" అన్నాడు.

ప్రసాదరావు "ఆయనా మేమూ ఒకటేనా పోనీ?" అని అడిగాడు.

మిగిలిన వారు అర్థం చేసుకుని నివ్వెర పోయారు. తులసీదాసు ముఖం అవమానంతో ఎర్రబడింది. ప్రసాదరావు "చెప్పవోయ్! మేమూ ఆయనా ఒకటి అవునా కాదా?" అని రెట్టించాడు.

పుల్లమ రాజుకు తెలుసు. తులసీదాసు కేవలం నూటయాభై రూపాయల గుమస్తా. మిగిలిన నలుగురూ ఎనిమిది వందలుపైగా సంపా దించే ఆఫీసర్లు. అతడు మొహం ముడుచుకున్నాడు.

ప్రసాదరావు మళ్ళీ పెద్దగా "ఏరా మాట్లాడవేం? ఒళ్ళుకొవ్వె క్కిందా? సమాధానం చెప్పకుండా నిలబడతావేం?" అని గద్దించాడు.

పుల్లమరాజు యిప్పుడూ మాట్లాడలేదు. విశ్వనాథం "ఊరుకో వయ్యా! ఏమిటీ అనవసరపు గొడవ...." అన్నాడు.

"నువ్వాగు—ఇది అనవసరపు గొడవకాదు" అంటూ లేచి "ఏరా సమాధానం చెబుతావా నాలుగుతగిలించమంటావా?" అన్నాడు ప్రసాదరావు.

పుల్లమరాజు కాళ్ళలో వొణుకు పుట్టింది....ఏదో చెప్పబోయాడు. కాని మాట పైకిరాలేదు.

"ఏరా రాస్కెల్! సమాధానం చెబుతావాలేదా!" అంటూ పుల్లమరాజు చెంపమీద లాగి ఒక్కపెట్టు పెట్టాడు ప్రసాదరావు.

"బాబోయ్! కొట్టకండిబాబూ, మీకు దణ్ణమెడతాను...." అంటూ ఏడుపు మొదలుపెట్టాడు పుల్లమరాజు.

తులసీదాసుఅప్పుడు కుర్చీలోనుంచి లేచాడు. విసురుగా ముందుకు వచ్చి పుల్లమరాజును పక్కకు నెట్టి ప్రసాదరావు కాలరు గట్టిగా పట్టుకుని గుంజాడు. "మిస్టరు ప్రసారరావ్! ఇందాకటినుంచీ ఓపికతో చూస్తున్నాను! ఇక సహించను. నువ్వు చాలా నేర్పుగా మనుషులను అవమానించగలవు. కాని ఎల్లప్పుడూ అందరితోనూ అది కుదరదు. నా మీద కసి పెట్టుకుని మధ్యలో వాణ్ణి ఎందుకు సతాయించడం? నేను చెబుతాను నీ ప్రశ్నకు సమాధానం....బాగావిను" వాళ్ళ సంగతి ఏమో తెలీదుగానీ నీ కంటే మాత్రం నేను తప్పక గొప్పవాణే....ఈ నిర్భాగ్యుడు కూడా నీ కంటే ఖచ్చితంగా గొప్పవాడే. మాతో పోలిస్తే నువ్వూ నీ వెయ్యిరూపాయల జీతమూ, నీ కారూ, బంగళా ఏమీ లేనట్టేలెక్క ఇకమీదట ఎప్పుడూ గుమాస్తా గాళ్ళను అట్లా అవమానించకు. వొళ్ళు దగ్గరుంచుకో....అందరి దగ్గరా నీ తెలివి తేటలూ, ఆటలూ సాగుతాయని పొరబడకు. టేక్ కేర్...."

తులసీదాసు ఆ మాటలని ప్రసాదరావు కాలరు వదలి యివతలకి వచ్చాడు. అతని ముఖం ఎర్రగా కందగడ్డలా తయారైంది. టేబిల్ మీది ముక్కలు ఒకచోటచేర్చి విశ్వనాథంవైపు తిరిగి "సారీసార్. నేను వెళ్ళిపోతాను. ఏమీ అనుకోకండి" అని పుల్లమరాజు రెక్కపట్టుకుని లేవదీసి "రాపోదాం.... నువ్వూ అటేగా వచ్చేది," అన్నాడు.

పుల్లమరాజు లేచి తులసీదాసు వెంట నడిచాడు. ఇద్దరూ మెట్లుదిగి అవరణలో వున్న మూడుకార్ల పక్కగా నడిచి బయటికి వచ్చారు. తులసీదాసు పుల్లమరాజు చెయ్యిపట్టుకుని ముందుకు నడిచాడు.

లోపల విశ్వనాథం, శాస్త్రి, ప్రభాకరం ముగ్గురూఒక్క క్షణం నిశ్శబ్దంగా కూర్చుని తర్వాత ఒక్క సారిగా లేచి బయటికి వచ్చారు. అక్కడే బొమ్మలాగా నిలబడి వున్న ప్రసాదరావుతో వారు ఒకమాట అయినా మాట్లాడకుండా బయటికి నడిచారు. అంతలో స్పృహలోకి వచ్చిన ప్రసాదరావుకు కార్లు మూడూ స్టార్టయి వెళ్ళిపోతున్న సవ్వడి వినిపించింది.

ప్రసాదరావునెమ్మదిగా యివతలికి వచ్చి నడవటం ప్రారంభించాడు. అరఫర్లాంగు నడిచేసరికి తన బంగళా లోపల అల్సేషియన్ కుక్క మనిషి అలికిడి విని "భౌ" మని అరుస్తూ వచ్చిపడింది.

అతడు గేటుతీసుకుని లోపలికి వెళ్ళాడు. నెమ్మదిగా మెట్లెక్కి పైకి వెళ్ళేసరికి అతనిభార్య ప్రశాంతంగా నిద్రపోతూ కనిపించింది.

అతడు దుస్తులు మార్చుకుని నిశ్శబ్దంగా నిద్రపోదామని ప్రయత్నించాడు. కాని ఎంత సేపటికీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు.

అతనికి తెల్లవారుజామున ఎప్పుడో నిద్రపట్టింది. కాని నిద్రపట్టిన పావుగంటలోనే మొన్న వచ్చిన కలే మళ్ళీ వచ్చింది. అతడు ఉలికిపడి మేలుకున్నాడు. నిద్రలేక ఎర్రబడిన కళ్ళతో కిటికీలోనుంచి చూస్తే ఎర్రగా నిప్పుముద్దలా సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఆ దిశ ఆకాశం అంతా ఎర్రగా రక్తం పులుమబడిన కాయితంలావుంది. అతనిభార్య ఎప్పుడు లేచి స్నానాదులు ముగించుకొందోమరి ప్రశాంతంగా వచ్చి భర్తను పలుకరించింది.

"రాత్రి బాగా పొద్దుపోయినట్టుందే క్లబ్బునుంచి వచ్చేసరికి. చడీ

చప్పుడూ లేకుండా దొంగలాగావచ్చి పడుకున్నారు ...." అన్నది నవ్వుతూ.

ఆమె నుదుట పెద్ద కుంకుమబొట్టు అతని మనసులో దాగివున్న నిప్పుముద్దలా, ఉదయిస్తున్న సూర్యబింబంలా వుంది.

ప్రసాదరావు భార్య ముఖంలోకి చూసి నవ్వేందుకు ప్రయత్నంచేసి విఫలుడైనాడు.

---///---